ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 రంగారెడ్డి
ఆదివారం
30 మార్చి 2025



శ్రీవిశ్వావసుకు స్వాగతం

'ఉగాది'కి అన్ని ఏర్పాట్లు పూర్తి

ఉగాది విశిష్టత పచ్చడి. జీవితంలో మంచి చెడులు, కష్టసుఖాలు అంతర్భాగమని వాటిని ధైర్యంగా స్వీకరించడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఈ పచ్చడి అంతరార్థం. కొత్త సంవత్సరానికి గుర్తుగా కొత్త బెల్లం, చింతపండు, మామిడికాయ, వేపపువ్వు, ఉప్పు, కారం కలిపి ఈ పచ్చడి తయారు చేస్తారు. తీపి, చేదు, కారం, ఉప్పు, పులుపు వగరు రుచులు.. విచారం, సంతోషం, కోపం, భయం, అయిష్టత, ఆశ్చర్యాన్ని సూచిస్తాయి. కాగా, గతంలో ఇంటి ఆవరణలోనో, ఇంటి పక్కనో దొరికే వేపపువ్వు.. నేడు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మామిడాకుల తోరణాలు.. కోకిలమ్మ రాగాలు.. వసంతుని వలపు గీతాలు, వేప పూల చేదు భాష్యాలను తెలిపే 'ఉగాది' ఉశస్సు వచ్చేసింది. చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం కొత్త తెలుగు సంవత్సరాది(శ్రీవిశ్వావసు సంవత్సరం)కి ఘనంగా స్వాగతం పలికేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. షడ్రుచులతో చేసే పచ్చడి ఈ పండుగ ప్రత్యేకం. తియ్యని భక్ష్యాలు ఈ వేడుకకు మరింత ఆనందాన్ని జోడించనున్నాయి. క్రోధి నామ సంవత్సరం ముగిసింది. శ్రీవిశ్వావసు సంవత్సరంలో అందరి జీవితాల్లో కోటి కాంతులు నిండాలని ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ పఠనాలు, పచ్చళ్ల పంపిణీకి ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.

- రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి)

అందంగా ముస్తాబైన ఆలయాలు

సాయంత్రం పంచాంగ శ్రవణం, పచ్చడి పంపిణీ

క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు



ఉగాది శుభాకాంక్షలు



ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి. సంవృద్ధిగా వర్షాలు కురిసి వంటలు పుష్కలంగా పండి రైతులు ఆనందంగా ఉండాలి. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది మరింత సమర్థవంతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తుంది.

-ప్రసాద్ కుమార్, శాసనసభ స్పీకర్

ప్రజలందరికీ శుభాలు చేకూరాలి



అందరికీ ఉగాది పండగ శుభాకాంక్షలు. ఈ పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలి. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం అందరికీ కలిసిరావాలి. అలాగే అందరూ ఆయురారోగ్యాలు కలగాలి.

--నారాయణరెడ్డి, కలెక్టర్, రంగారెడ్డి

ఆరోన్ ఆసుపత్రి సీజ్

లైసెన్స్ రెన్యూవల్ కోసం సమర్పించిన రెంటల్ డీడ్ పత్రాలపై విచారణ

ఆ పత్రాలను ఆసుపత్రి యజమాని ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణ

ఆసుపత్రి లైసెన్స్ రద్దు, సీజ్ చేసిన డీఎంహెచ్‌వో, వైద్య బృందం



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్యశాఖ అధికారులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నార్సింగి ఆరోన్ ఆసుపత్రిని శనివారం వైద్యాధికారులు సీజ్ చేశారు. అనుపత్రి అనుమతి రెన్యూవల్ కోసం ఫేక్ డాక్యుమెంట్ సమర్పించిన కేసులో డీఎంహెచ్‌వో, అధికారుల బృందం విచారణ చేపట్టారు. ఫేక్ డాక్యుమెంట్ సమర్పించిన ఆసుపత్రి యజమాని ఏలియమ్మ సెబాస్టియన్‌ను గత రెండు రోజుల క్రితం నార్సింగి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. యథావిధిగా ఆసుపత్రి కొనసాగుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి యజమాని సమర్పించిన రెంటల్ డీడ్ పత్రాలు ఫోర్జరీ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. బిల్డింగ్ యజమాని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తెలిపారు. ఆరోన్ ఆసుపత్రి అనుమతులు రద్దు చేసినట్లు చెప్పారు. రెంట్ డీడ్ ఫోర్జరీ చేసిన కేసులో ఆసుపత్రి కొనసాగింపును రద్దు చేయడం జరిగిందని, అలాగే ఆసుపత్రిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఐదుగురు నకిలీ ఆర్ఎంపీల గుర్తింపు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తనిఖీలో భాగంగా శనివారం జిల్లాలోని పలు ఆసుపత్రిలపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదుగురు ఆర్ఎంపీలను నకిలీ డాక్టర్లుగా గుర్తించారు. వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదు చేశారు. కొండాపూర్‌లోని న్యూ హఫీస్ వద్ద కొనసాగుతున్న వెంకటేశ్వర క్లినిక్, ప్రేమ్‌నగర్ బి-బ్లాక్‌లోని శ్రీ సాయి ఫస్ట్ ఎయిడెడ్ సెంటర్, కొండాపూర్‌లోని మార్తాండ నగర్‌లోని కవిత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, గణేష్ మండపం వద్ద రెహమానియా క్లినిక్, మదీనాగూడలోని కిరణ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేశారు. నకిలీ ఆర్ఎంపీలుగా గుర్తించిన ఐదుగురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేశారు.

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఇప్పటికే రూ.10వేల కోట్లతో అభివృద్ధి పనులు

- వచ్చే ఐదేళ్లలో మరో 10వేల కోట్లతో అభివృద్ధి
- అడ్డుకోవాలని చూసే ఇంటి దొంగలను తరిమికొట్టాలి
- పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్/ వికారాబాద్ ప్రతినిధి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రానున్న పదేళ్లలో కొడంగల్ నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి తన నివాసంలో ఏర్పాటు చేసిన 'జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్' సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలు ఇచ్చిన శక్తితోనే ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానన్నారు. కొడంగల్ అభివృద్ధిని దెబ్బతీయాలనే కుట్రతో లగచర్ల రైతులను రెచ్చగొట్టి పరిశ్రమలను అడ్డుకునేందుకు చేస్తున్న వారి కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే రూ.10వేల కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఐదేళ్లలో మరో రూ.10 వేల కోట్లతో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీలను పక్కన పెట్టి అభివృద్ధిలో

మిగతా 7వ పేజీలో...

వేద పండితుల ఆశీర్వచనాలు

సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయనను వేద పండితులు ఆశీర్వదించారు. సీఎం వెంట తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో రాజేందర్‌రెడ్డి ఉన్నారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

» ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు



మాట్లాడుతున్న బాలరాజు

శంషాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏప్రిల్ 21, 22 తేదీల్లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ (ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు పిలుపునిచ్చారు. శంషాబాద్‌లోని కార్యాలయంలో శనివారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు లక్షల మంది ఉన్నారన్నారు. వారందరినీ ఏఐటీయూసీలోనికి ఆహ్వానించి మండలాల వారీగా కమిటీలు వేసి కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అధిక శాతం కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చిన వారే ఉన్నారన్నారు. వలసకార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ న్యాయం జరిగే విధంగా పోరాటాలు నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్ అన్నారు. ఈ పోరాటాల ఫలితంగా వచ్చిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. శేఖర్, జిల్లా కార్యదర్శి దత్తు, చందు, నర్సింహ్మారెడ్డి, రంగారెడ్డి, డి.ప్రసాద్, నగ్రాగిరి కేతరాజు నర్సింహ్మ, సక్రూనాయక్, స్వామి, టి.రాములు, నరేందర్ బి.నర్సింహ్మ, వెంకట్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)

తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

» నైపుణ్యమున్న 40 మంది మేస్త్రీలకు శిక్షణ

» కలెక్టర్ నారాయణరెడ్డి



మేస్త్రీలకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహ నిర్మాణంలో తక్కువ ఖర్చుతో ఇండ్లు నిర్మించేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాలో నైపుణ్యమున్న 40 మంది మేస్త్రీలకు శిక్షణ ఇచ్చినట్లు కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్ఏసీ బండ్లగూడ ద్వారా శిక్షణ పొందిన 40 మంది మేస్త్రీలకు సర్టిఫికెట్లను అందజేశారు. తొలివిడత ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ మేస్త్రీలు ఇండ్ల నిర్మాణాలు చేపడతారని పేర్కొన్నారు. శిక్షణలో రోజుకు రూ.300 చొప్పున, డ్రెస్సులు, హెల్మెట్లు ఇచ్చినట్లు ఎంపిక చేసిన గ్రామాల్లో శిక్షణ పొందిన మేస్త్రీలు ప్రతి గ్రామంలో నాలుగు నుంచి పది ఇండ్ల వరకు వీరే నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇంకా కొంతమందికి శిక్షణ ఇచ్చి మేస్త్రీల కొరత ఉన్న గ్రామాలకు పంపించనున్నట్లు చెప్పారు. రెండో విడత శిక్షణలో డీఆర్‌డీఏ ద్వారా మహిళలకు కూడా మేస్త్రీలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ పీడీ డీసీ.నాయక్ పాల్గొన్నారు.

స్పందన అంతంతే..!

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులకు ముందుకురాని దరఖాస్తుదారులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియకు అంతంత మాత్రంగానే స్పందన వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పించినా రుసుము చెల్లింపునకు చాలామంది ముందుకురావడం లేదు. అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించినా ఫలితం కనిపించడం లేదు. ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుంది. అయితే ఫీజు చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు వస్తుండటంతో గడువు పొడిగించాలని డిమాండ్లు వస్తున్నాయి.

- రుసుముల చెల్లింపులో 25శాతం రాయితీ
- రేపటితో ముగియనున్న ఫీజు చెల్లింపు గడువు
- సాంకేతికపరమైన అడ్డంకులతో ఇబ్బందులు
- గడువు పొడిగించాలంటున్న ప్లాట్ల యజమానులు



రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్- లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) రుసుములపై 25 శాతం రాయితీ ఇచ్చినా ఫీజు చెల్లింపుల ప్రక్రియ జిల్లాలో మందకొడిగా సాగుతోంది. ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపాలిటీల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందగా.. ఫీజు చెల్లిస్తున్న వారి సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. రాయితీ గడువు ఈనెల 31తో

మిగతా 7వ పేజీలో...





యువత క్రీడల్లోనూ రాణించాలి

చేవెళ్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు యువత క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ అన్నారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..యువత చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసకి చూపించాలన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆటల్లో గెలుపోటములను సహజంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్త, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, క్రీడకారులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న చేవెళ్ల ఏసీపీ కిషన్

పక్షులకు నీరు, ఆహారం అందించాలి

ఘట్‌కేసర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎండ కాలంలో పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నోజిగూడ యాదాద్రి పార్కులో పక్షుల కోసం తాగునీరు, చిరుధాన్యాలను ఉంచారు. ఇళ్లవద్ద, పార్కుల్లో, పక్షులు తిరిగే ప్రదేశాల్లో ఆహారం, తాగునీటి వసతి కల్పించాలని కోరారు. మూడు నెలలు ఈ కార్యక్రమాని కొనసాగిస్తే పక్షల ప్రాణాలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ననావత్ జితేందర్‌నాయక్ పాల్గొన్నారు.


పక్షులకు ఆహారాన్ని ఏర్పాటు చేస్తున్న కొండల్‌రెడ్డి





ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్

కడ్తాల్, మార్చి29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా విశ్వాసం కోల్పోయిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 2న కడ్తాల మండలం బోయిన్‌గుట్ట తండా, ముద్విన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటన, ఏర్పాట్లపై చర్చించారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమి లేదని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్‌కే దక్కిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధే తప్ప గ్రామాల్లో కొత్తగా చేసిన పనులేమీ లేవని విమర్శించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కడారి రామకృష్ణ, లచ్చిరామ్ నాయక్, బొప్పిడి గోపాల్, హరిచంద్ నాయక్, చంద్రమౌళి, రమేశ్, జోగు వీరయ్య, యాదయ్య, అంజి, వెంకటయ్య, నర్సింహ్మా గౌడ్,నర్సింహ్మా, సేవ్య నాయక్, గోపాల్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, మేధావుల కృషితోనే భారతీయ సంస్కృతి, సంప్రదాయలు వర్ధిల్లుతున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ గ్రేడ్-1 శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని శనివారం 'భారతీయ సంస్కృతి-మహా కుంభమేళ ప్రాశస్త్యం' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. పోటీలో వీరబ్రహ్మాచారి మొదటిస్థానంలో, సాకేత్ ప్రవీణ్ రెండో స్థానంలో, హరీష్‌కుమార్‌శర్మ మూడో స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికను అందజేసి అభినందించారు. షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది మహేందర్‌రెడ్డి రాసిన తొలి కవితను ఎమ్మెల్యేకు బహూకరించారు. షాద్‌నగర్ చరిత్రను వంగూరి గంగిరెడ్డి కవిత రూపంలో వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత ప్రముఖ్ బండారి రమేష్, సామాజికవేత్త బెజ్జుగం రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు క్యాసెట్ శ్రీనివాస్‌యాదవ్, నక్క బాల్‌రాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా కాంగ్రెస్

ముస్లింలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రంజాన్‌ను పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫాను అందించారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి అవసరమైన ధ్రువపత్రాల జారీలో జాప్యం చేయొద్దని అధికారులకు సూచించారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలను వెంటవెంటనే జారీ చేయాలని సూచించారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్






కంపెనీల ప్రతినిధులతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

మహిళా సాధికారతతోనే ప్రగతి

ఆమనగల్లు/మాడ్గుల,మార్చి29(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మహిళలు, యువతులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో రాణించాలని కోరారు. ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం మహిళల ఉద్యోగ, ఉపాధి కల్పనపై వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇప్పటికే వివిధ కంపెనీల్లో 167 మంది మహిళలకు ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ, జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, అభినవ్ రెడ్డి, చంద్రశేఖర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు. మాడ్గుల మడలంలోని కాంట్రాగాని తండాలో తుల్జా భవానీ మాతాలయంలో తండావాసులు లంబాడీల ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హింసి రాంలాల్‌నాయక్, నర్సింహ, దేవు, రాములు, అమర్‌సింగ్, రవీందర్, పవన్, రాజు, హరి పాల్గొన్నారు.

సొసైటీలపై విశ్వాసం చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సొసైటీపట్ల రైతులు విశ్వాసం చూపించాలని, మనదే అనే భావన కలిగి ఉండాలని తట్టెపల్లి సొసైటీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. తట్టెపల్లి సహకార సంఘంలో శనివారం సభను నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ మొండి బకాయిలపై వన్ టైం సెటిల్‌మెంట్ నిర్ణయం తీసుకోవాలని, వడ్డీలో 90శాతం మాఫీ చేయాలని ఉన్నతాధికారులను కోరానన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అంజయ్య, డైరెక్టర్లు ఇందూరు నరేందర్, ఉప్పరి మల్లేశం, సీఈవో రాజమౌళి, రాములు తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకపోవడంతోనే బకాయిలు పేరుకున్నాయని రైతులు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

దుద్యాల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అని కొడంగల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అన్నారు. శనివారం దుద్యాలలో రూ.10లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామియా, శకనప్ప, ఖలీల్, సత్యనారాయణ పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న వేణుగోపాల్

ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ విద్య

కొడంగల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి అన్నారు. శనివారం అధ్యాపకులతో కలిసి కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

ఘనంగా పాఠశాల 75వ వార్షికోత్సవం

కీసర, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల స్థాపించి 75సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. నాగారం పరిధిలోని కరీంగూడ ప్రభుత్వ పాఠశాల 75 వసంతాల(డైమండ్ జూబ్లీ) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. వారి కుటుంబాలతో సందడి చేశారు. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, విద్యాధికారి శశిధర్, ట్రాన్స్‌కో ఏఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఘట్‌కేసర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా శ్రమించాలని శ్రీనిధి యూనివర్సిటీ ప్రో చాన్స్‌లర్ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి యంనంపేట్‌లోని శ్రీనిధి వర్సిటీ మొదటి వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రో వీసీ మాట్లాడుతూ.. అవిష్కరణపై దృష్టిసారించి మన్ననలు పొందేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు అభిజిత్‌రావు, ఎం.కార్తికేయన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశానికి ముదిరాజ్‌లను పిలవకపోవడం సరికాదు

ఘట్‌కేసర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో ఈ నెల 27న నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ సన్నాహక సమావేశానికి ముదిరాజ్‌లను ఆహ్వానించకపోవడం సరికాదని కులస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఘట్‌కేసర్‌లోని సంఘం కార్యాలయంలో సమావేశానికి కొందరినే పిలిచారని ఆరోపించారు. పట్టణ పెద్దలు లోచించి మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని కులాకు సమప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బర్ల కిష్టయ్య, శ్రీశైలం, రవికుమార్, ఆంజనేయులు, శంకర్, రాధాకృష్ణ, గండయ్య తదితరులు పాల్గొన్నారు.



భవానీ రామలింగేశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా మాసశివరాత్రి పూజలు

శామీర్‌పేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో శుక్రవారం రాత్రి మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. అర్చకులు మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పరీక్షల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పరిగి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. శనివారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01లో హెచ్ఎంల సమావేశంలో మాట్లాడారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4, ఎల్ఐపీ, బేస్‌లైన్, మిడిల్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షల వివరాలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బొంరాస్‌పేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం బురాన్‌పూర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సిములు గౌడ్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'అగ్నివీర్'కు ఇద్దరి ఎంపిక

తాండూరురూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ సైనిక ఉద్యోగాలకు తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు స్నేహితులు ఒకేసారి ఎంపికయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి, సందీప్ మోడల్ స్కూల్‌లో చదువుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో వీరిద్దరు పాల్గొని ఆర్మీకి ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పీఈటీ యాదగిరి, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

పరిగి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పరిగి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిఫ్ కోర్టు బార్‌అసోషియేషన్ ఎన్నికలు శనివారం జరిగాయి. కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఇబ్రహీంఖాన్, ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా ఎం.ఆనంద్‌రావు, ముకుంద వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా విజయ్‌కుమార్, శివారెడ్డి వ్యవహరించారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

తాండూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తాండూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. శనివారం సీనియర్ న్యాయవాది మనోహర్‌రావు ఎన్నికలు నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎం.ఆంజనేయులు, కోశాధికారి సోఫియా బేగం, మహిళా ప్రతినిధి టి.అరుణ, లైబ్రేరియన్ మస్తాన్ అలీ, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ ప్రతినిధిగా జిలానీ, సభ్యులుగా ఎన్.నరేందర్‌సింగ్ ఎన్నికయ్యారు.

చలివేంద్రం ప్రారంభం

యాలాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు, బాటసారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎంపీవో యాదయ్య అన్నారు. శనివారం జుంటుపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పంచాయతీల ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కురుమ సంఘం సభ్యులు

కొమురయ్య విగ్రహం వద్ద శుభ్రం చేయాలి

తాండూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని యశోదనగర్ పార్కులో ఉన్న ఆయన విగ్రహం చెత్తను తొలగించాలని డివిజన్ కురువ సంఘం ప్రతినిధుల శనివారం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ఒగ్గుడోలు కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప, డివిజన్ అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, పట్టణాధ్యక్షుడు నర్సిములు, పెద్దేముల్ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, మల్లేశం, దస్తగిరి, నాగప్ప పాల్గొన్నారు.

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

(ఐదో పేజీ తరువాయి)

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే ఇంటి దొంగలను తరిమి కొట్టాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీరాంరెడ్డి, ముద్దప్ప దేశ్‌ముఖ్, నందారంప్రశాంత్, ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. సన్నాహక సమావేశం అనంతరం రోడ్డు మార్గాన ఆయన హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

ఇఫ్తార్‌లో ప్రత్యేక ప్రార్థనలు



బ్రహ్మోత్సవాల్లో పూజ చేస్తున్న సీఎం

కొడంగల్ పట్టణంలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు ఖరేషి, కల్వ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎండీ యూసూఫ్, గౌసన్, ఆసిఫ్‌ఖాన్, నహీం, నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తాపట్నాయక్, ఎస్పీ నారాయణరెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి స్వాగతం పలికారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

భారీ పోలీసు బందోబస్తు

సీఎం పర్యటనతో కొడంగల్‌లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్టీజోన్ ఐజీ -2 సత్యనారాయణ ఆధ్వర్యంలో వికారాబాద్, నారాయణపేట, గద్వాల ఎస్పీలు సీఎం భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలీప్యాడ్, వేంకటేశ్వరస్వామి దేవాలయం, ఇఫ్తార్ విందు ఇచ్చిన రాఘవేంద్ర గార్డెన్స్, అంబేద్కర్ చౌరస్తాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు.

స్పందన అంతంతే..!

(ఐదో పేజీ తరువాయి)

ముగుస్తుందని ప్రభుత్వం చెబుతున్నా చాలామంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రచారం చేసినా ఫలితం కనిపించడం లేదు. దీనికి కారణం స్థిరాస్తి వ్యాపారం తగ్గడంతో ప్లాట్ల కొనుగోలుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అప్పు సప్పు చేసి రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకున్నా ప్లాట్లు అమ్ముడు పోతాయా? అనుకున్నంత ఆదాయం వస్తుందా? అన్న సంశయంలో ఉన్నారు.

కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు

అక్రమంగా చేసిన లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో దరఖాస్తులను ఆహ్వానించింది. 2020 ఆగస్టు 26 కంటే ముందుగా కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్లాట్‌కు వెయ్యి రూపాయలు, వెంచర్‌కు రూ.10వేలుగా ఫీజు నిర్ణయించింది. దీంతో లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం భారీ స్పందన లభించింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 29 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ కోసం ఉమ్మడి జిల్లాలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల్లో మొత్తం 4,40,909 దరఖాస్తులు వచ్చాయి. 20,025 మంది దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ కోసం ఫీజు చెల్లించారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ.82.8 కోట్లు ఫీజుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం లభించింది.

రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో 2,64,636 దరఖాస్తులు సీకరించగా పంచాయతీల్లో 44,110 దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలుపుకుని మొత్తం 3,08,847 దరఖాస్తులు స్వీకరించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న స్థలాలకు అనుమతులు లభించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. ఈ క్రమంలో రెండు, మూడు దశల్లో పకడ్బందీగా పరిశీలన చేపట్టింది. రెండో దశలో దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? రోడ్డు వెడల్పు, ఖాళీ స్థలం తదితర నిబంధనలు లే అవుట్‌లో పాటించారా? అనే అంశాలను పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదించారు. మూడో దశలో దరఖాస్తులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇతర అధికారులు పరిశీలించి ధ్రువీకరించారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, గ్రామ పంచాయతీల్లోని దరఖాస్తులను కూడా అదనపు కలెక్టర్ ధ్రువీకరించారు. మున్సిపాలిటీల్లో 12,031 దరఖాస్తులకు సంబంధించి ఫీజులు చెల్లించారు. 3,365 ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ నుంచి రూ.78.07 కోట్లు ఫీజు రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. జిల్లాలో పది గ్రామ పంచాయతీల నుంచి ప్లాట్లు, అక్రమ లేఅవుట్లకు సంబంధించి 44,208 దరఖాస్తులు రాగా... 4,897 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. మున్సిపాలిటీతో పాటు పంచాయతీల్లో కూడా చాలా వరకు దరఖాస్తుదారులు ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 595 పంచాయతీల్లో కలుపుకుని మొత్తం 36,995 దరఖాస్తులను స్వీకరించారు. అందులో మున్సిపాలిటీల్లో 20,900, పంచాయతీల్లో 16,095 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 3,097 దరఖాస్తులకు సంబంధించి రూ.8.58 కోట్లు ఫీజులు చెల్లించారు. అందులో మున్సిపాలిటీలకు సంబంధించి 1,659 దరఖాస్తులకు రూ.4.73 కోట్లు, పంచాయతీలకు సంబంధించి 1438 దరఖాస్తులకు రూ.3.85 కోట్లు చెల్లించడం జరిగింది. మున్సిపాలిటీల్లో 706 దరఖాస్తులకు, పంచాయతీల్లో 58 దరఖాస్తులకు ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 12 మున్సిపాలిటీలు, నాలుగు కార్పొరేషన్లు ఉన్నాయి. క్రమబద్ధీకరణ కోసం 1,55,373 దరఖాస్తులు రాగా, సుమారు 7వేలకు పైగా ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది.



పంచాయతీల్లో..

జిల్లా	స్వీకరించిన దరఖాస్తులు	ఫీజు చెల్లించిన దరఖాస్తులు
రంగారెడ్డి	44,508	4,897
వికారాబాద్	16,095	1,438
మొత్తం	60,603	6,335

మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ వివరాలు

	రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్	మొత్తం
స్వీకరించిన దరఖాస్తులు	2,64,636	1,55,373	20,900	4,40,909
ఫీజు చెల్లించిన దరఖాస్తులు	12,031	0	1,659	13,690
చెల్లించిన ఫీజు (రూ.కోట్లలో)	రూ.78.07 కోట్లు	00	రూ. 4.73 కోట్లు	రూ.82.8 కోట్లు
ప్రొసీడింగ్స్ ఇచ్చినవి	3,365	7,000	706	11,071

సాంకేతిక సమస్యలు..

తాండూరు : ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులు సాంకేతిక పరమైన అంశాలు అడ్డంకిగా మారాయి. రిజిస్ట్రేషన్ డీడ్ ప్రకారంగా ఉన్న స్థలం కాకుండా ఫీజు కట్టిన రసీదులో ఎక్కువ తక్కువ స్కోయర్ మీటర్లు సూచించడంతో ఫీజులలో తేడాలు వస్తున్నాయి. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చూసి అవాక్కవుతున్నారు. ఫీజు కట్టిన తర్వాత తప్పులు రావడంతో సవరణ కోసం మున్సిపాలిటీ చుట్టూ తిరిగితే అక్కడ చేప్పే వారు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం ఇచ్చేందుకే సాంకేతిక అడ్డంకులు తొలగించేందుకు తాండూరు మున్సిపాలిటీలో సిబ్బంది సరైన విధంగా స్పందించక పోవడంతో దరఖాస్తుదారులు పూర్తి సమాచారం తెలియక వెనుకంజ కూడ వేశారు. హెల్ప్ డెస్కులు ఉన్నప్పటికీ అక్కడ చేప్పే వారు ఉండరు.

గడువు మరో నెల పొడిగించాలి



సర్వర్ బిజీగా ఉండటంతో పేమెంట్ ఆలస్యమవుతుంది. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఫీజు చెల్లిస్తే డబ్బులు కట్టవుతున్నట్లు చూపిస్తుంది. కానీ ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్‌కు ఫీజు చెల్లించనట్టుగా కనిపిస్తుంది. సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించాలి. ఎల్ఆర్ఎస్ గడువు మరో నెల పొడిగిస్తే బాగుంటుంది.

ఆదిత్యారెడ్డి, షాద్‌నగర్

డాక్టర్ల నిర్లక్ష్యంతో మహిళ మృతి?

- మృతురాలి కుటుంబీకుల ఆరోపణ
- అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద నిరసన



అర్ధరాత్రి ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అంబులెన్స్‌ను అడ్డుకున్న పోలీసులు

వికారాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని ఆమె భర్త, కుటుంబీకులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఈ సంఘటన వికారాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పూడూర్ మండలానికి చెందిన దివ్యవాణి ఈ నెల 20న వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పుకోసం చేరింది. ఆమెకు పాప పుట్టిన తరువాత బీపీ పెరగడంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. అయితే 28న ఆరోగ్యం విషమించడంతో భర్త రావేందర్ మళ్లీ వికారాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఇషా ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ దివ్యవాణికి చికిత్స అందించే సమయానికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకులు దివ్యవాణి మృతదేహాన్ని మొదటి ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా ఎన్టీఆర్ చౌరస్తాలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, మృతురాలి కుటుంబీకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే మృతికి కారణమని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. పోలీసులు చేరుకుని వారిని సమూదాయించారు. చివరకు ఆస్పత్రి వర్గాలు ఆర్థికసాయం అందించడంతో మృతురాలి కుటుంబీకులు శాంతించినట్లు తెలుస్తోంది.



మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

ముఖ్యమంత్రి నిర్ణయాలు సాహసోపేతం

- డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 29, (ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిఅన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకనుగుణంగా ఉగాది నుంచి ప్రజలకు సన్నబియ్యం అందించనుందని చెప్పారు. రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదై ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు అందిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామరాజేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేస్తామని మాట తప్పిన ప్రభుత్వం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ బాధిత రైతులకు చ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఫార్మాసిటీని రద్దు చేసి సేకరించిన భూములను తిరిగిచ్చేస్తామని రైతులను మోసం చేశారన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మాకు భూసేకరణ చేసిన గ్రామాల్లో 500 మంది రైతులకు సంబంధించి 2500 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని, దీంతో వారు అవసరాలకు అమ్ముకునే పరిస్థితిలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాక రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు అందడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఫ్యూచర్ సిటీ పేరుతో మరిన్ని భూములను సేకరించాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో భూముల రేట్లు కోట్ల రూపాయలు పలుకుతున్నాయని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వడంతోపాటు ఎకరాకు 500 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామంటూ ఆయన హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు, జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, నాయకులు చంద్రమోహన్, జగన్, జగదీష్, కవిత, నర్సింహ, జంగయ్య, బుగ్గరాములు, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ చేస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

కలెక్టరేట్‌లో ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్

రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో శనివారం ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు వచ్చినప్పుడు చేపట్టే సహాయ చర్యలు, ప్రమాదాల నుంచి ఎలా కాపాడుతారనే అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. భవనాలు కూలిపోయినప్పుడు, కొండచరియలు విరిగినప్పుడు, వినాశకరమైన వరదలు వచ్చినప్పుడు, తుపాన్ల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ టీం ధైర్య సాహసాలతో ప్రజలను రక్షిస్తుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ టీం సభ్యులు, కలెక్టరేట్ ఏవో సునీల్, కలెక్టర్ సీసీ జనార్థన్, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మెదక్‌పల్లిలో విషాద ఘటనలో ముగ్గురు పిల్లల అంత్యక్రియలు పూర్తి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్‌లో విష ఆహారంతో మృతిచెందిన చిన్నారుల అంత్యక్రియలు శనివారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లిలో నిర్వహించారు. మెదక్‌పల్లికి చెందిన అవురిచింతల చెన్నయ్య, రజిత దంపతుల ముగ్గురు పిల్లలు విష ఆహారం తిని శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతి చెందిన సాయి క్రిష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8) మృత దేహాలను వారి స్వస్థలం మెదక్‌పల్లికి రాత్రి తీసుకువచ్చారు. ఉదయం తండ్రి చెన్నయ్య అంత్యక్రియలు నిర్వహించారు. ముగ్గురు పిల్లలు విష ఆహారం తిని మృతిచెందిన సంఘటన మెదక్‌పల్లిలో విషాదాన్ని నింపింది. స్థానికులను కలిచి వేసింది. అంత్యక్రియల్లో పాల్గొన్న పలువురు కంటతడిపెట్టారు. ముగ్గురు చిన్నారుల మృత దేహాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మెదక్‌పల్లిలో సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబానికి వ్యక్తిగతంగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, అల్వాల్ రెడ్డి, శంకర్, జగన్నాథం, విష్ణుగౌడ్, విజేందర్, నరేశ్, ఈశ్వర్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హతగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాని జిల్లా బీసీ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి పి. వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం అధికారిక వెబ్ సైట్ (www.mjptbcwreis.telangn.govin)లో చూసుకోవాలన్నారు.

లోవోల్టేజీ నివారణకు చర్యలు



సీహెచ్ బాలకృష్ణారావు, విద్యుత్‌శాఖ ఏడీఈ

ఫేస్ టు ఫేస్

ఆమనగల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా లోవోల్టేజీ నివారణకు అవసరమైన చోట విద్యుత్ ఉప కేంద్రాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. కోతలు లేకుండా విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నాం. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏడీఈ సీహెచ్ బాలకృష్ణారావు గురువారం ఆంధ్రజ్యోతితో వెల్లడించారు.

ఆమనగల్లు పరిధిలో ఎన్ని సబ్ స్టేషన్లు ఉన్నాయి?

ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో 22 సబ్ స్టేషన్లు ఉన్నాయి. ఆమనగల్లు మండలం సంకటోనిపల్లి, మాడ్గులలోని కలకొండ, తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్, కడ్తాల మండలంలోని మక్తమాదారంలో కొత్తగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించాం.

సబ్ డివిజన్ వ్యాప్తంగా ఎన్ని విద్యుత్ కనెక్షన్లున్నాయి?

మొత్తం 61,170 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వ్యవసాయ 21,189, గృహ, వ్యాపార, పరిశ్రమలకు సంబంధించి 39,981 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

వేసవిలో కరెంట్ కోతలు విధించే పరిస్థితి ఉందా?

సాంకేతికంగా సమస్యలు తలెత్తితే తప్ప కరెంట్ కోతలుండవు. నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

లోవోల్టేజీ నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

రావిచెడ్, ఆకుతోటపల్లి, గట్టిప్పలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంచాం. వెల్జాల, చంద్రదన, పోలెపల్లి, అందుగుల, కర్కల్ పహాడ్‌లో స్థాయి పెంపునకు ప్రతిపాదించాం.

సబ్ డివిజన్‌లో ఏ మేర విద్యుత్ బకాయిలున్నాయి?

నాలుగు మండలాల పరిధిలో రూ.7.89 కోట్లు బకాయిలున్నాయి. రూ.18 కోట్లు పాత బకాయిలున్నాయి. వినియోగదారులు బకాయిలు చెల్లించి సహకరించాలని కోరుతున్నాం.

వినియోగదారులకు మీరిచ్చే సూచనలేమిటి?

ఓవర్‌లోడ్ సమస్యకు రైతులు డీడీలు చెల్లిస్తే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం. విద్యుత్ సమస్య తలెత్తితే సమాచారం అందించకుండా సొంతంగా మరమ్మతులు చేపట్టకూడదు.

ఊరూరా ఉగాది శోభ

- నేడు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం
- ఉగాది సందర్భంగా మార్కెట్లలో సందడి
- గ్రామాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- పచ్చడి కోసం మట్టి కుండలకు గిరాకీ



ఆమనగల్లులో మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆమనగల్లు, మార్చి29(ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాదిని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం ప్రారంభం కానుంది. ఊరూవాడ పండుగ సందడి మొదలైంది. ఉగాది అంటేనే గుర్తొచ్చే భక్ష్యాలు, షడ్రుచుల పచ్చడి. వీటి తయారీకి అవసరమైన బెల్లం, శనగ పప్పు, చింతపండు, మామిడికాయలు, మట్టి కుండలు, టెంకాయ తదితర కొనుగోళ్లతో మార్కెట్లు, కిరాణా షాపుల్లో సందడి నెలకొంది. ఉగాదిని పురష్కరించుకొని వ్యవసాయ భూముల్లో వేకువ జామున గునకలతో రొప్పి భూతల్లిని పూజిస్తారు. పంచాంగ శ్రవణం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, పూజారులు ప్రధాన కూడళ్లు, రచ్చకట్టల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను అందంగా అలంకిరించారు. అయితే బెల్లం, నూనెలు, పప్పులు, కుండల ధరలు ఆకాశానంటుతున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచంద్ రెడ్డి, గుర్కా జైపాల్ యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ ప్రజలకు ఉగాధి శుభాకాంక్షలు తెలిపారు.



కేశంపేట: ఆర్‌వీ పాఠశాలలో..



షాబాద్: నాగర్‌గూడలో..



షాద్‌నగర్ అర్బన్: కాకతీయ పాఠశాలలో..



చేవెళ్ల: మోడల్ స్కూల్‌లో ఉగాది వేడుకలు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీందర్‌నాయక్

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

చౌదరిగూడ,మార్చి 29(ఆంధ్రజ్యోతి): అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని కొందుర్గు ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం జయమాలిని ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులపై అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది రాజేశ్వరి, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

చేవెళ్ల: అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని చేవెళ్ల ఏపీఎం శోభరాణి సూచించారు. శనివారం చేవెళ్ల మండల మహిళా సమాఖ్య భవనంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు, వీవోలు, వీవోఏస్‌లు ఉన్నారు.

ముస్తాబైన బుగ్గరామేశ్వరాలయం



షాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): షాబాద్ మండల పరిధిలోని కొమరబండలో కొలువుదీరిన బుగ్గరామేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి(ఆదివారం) నుంచి ఏప్రిల్ 7 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, ఈవో శ్రీనివాసులు తెలిపారు. 30న ధ్వజారోహణం, 31న రుద్రాభిషేకం, ఏప్రిల్ 1న అగ్నిగుండం, 2న పల్లకీ సేవా, 3న రథోత్సవం, 4న పార్వతీపరమేశ్వరుల కల్యాణం, 5న శివ నామస్మరణ, 6న దీపోత్సవం, 7న శివతీర్థం నిర్వహించనున్నట్లు వివరించారు. స్వామి వారి బ్రహోత్సవాలను తిలకించడానికి జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

చెరువులు, కుంటలను ఆధునికీకరిస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మార్చి29(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కుంటలను వర్షాకాలం నాటికి మరమ్మతు చేసి ఆధునికీకరిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్ల తాకిడీకి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పడకల్‌లో స్థానిక నాయకులు వీరన్న చెరువు, పందివాని కుంట చెరువును మరమ్మతు చేయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాను శ్రీనివాస్ రెడ్డి, జోగు రమేశ్, కాడేమోని శ్రీశైలం, శ్రీశైలం యాదవ్, జగ్గారెడ్డి, సత్యం, శంకర్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఆదిభట్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆదిభట్ల మున్సిపల్ మంగల్‌పల్లి, సాహెబ్‌గూడ పారిశుధ్య కార్మికులకు మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ జాంగిర్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచండంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు.

పంచాయతీ సిబ్బందికి..

మహేశ్వరం: పండగలను ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం నాయకుడు ఆజం శనివారం మహేశ్వరం పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఆజం, సాయినాథ్, శేషు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



షాద్‌నగర్ అర్బన్: ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేశంపేట, ఇబ్రహీంపట్నం, మంచాల, మొయినాబాద్, కొత్తూరు, ఆమనగల్లు, కందుకూరు, షాద్‌నగర్ మండలాల్లో పార్టీ జెండా ఎగురవేశారు. దివంగత సీఎం ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ హయాంలో జరిగిన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు శాయశక్తులా కృషి చేయాలని ఆ పార్టీ మండలాల అధ్యక్షులు పిలుపునిచ్చారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 29

సమాజ నిర్మాణంలో పాత్రికేయులు కీలకం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాధిక

ఇబ్రహీంపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిజం కోర్సు ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆలోచనలకు పదునుపెడితే ఈ రంగంలో రాణించవచ్చని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక అన్నారు. కళాశాలలో శనివారం జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాత్రికేయ వృత్తికి సమాజంలో ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కోర్సు సమన్వయకర్త డాక్టర్ సీవీ పవన్‌కుమార్, అధ్యాపకులు సురేష్, వెంకటేశ్వర్‌రావు, రవికుమార్, నీరజ, శంకర్, శ్రీకృష్ణ, రమణ పాల్గొన్నారు.

పండుగ రోజుల్లో సెలవు లేదు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ ప్రజలు ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు చెల్లించడానికి వీలుగా ఉగాది, రంజాన్ పర్వదినాలైన ఆది, సోమవారం కూడా మున్సిపల్ ఆఫీసు పనిచేస్తుందని కమిషనర్ సునిత శనివారం ప్రకటనలో తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను మున్సిపల్ ఆఫీసులోని ప్రత్యేక కౌంటర్‌లో చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అభివృద్ధిలో కొత్తపేట సహకార సంఘం



మాట్లాడుతున్న ప్యాక్స్ చైర్మన్ గంధ్ర జగదీశ్వర్ గౌడ్

కేశంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అంచనా బడ్జెట్ రూ.10 లక్షలు అని ప్యాక్స్ ఛైర్మన్ గంధ్ర జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ప్యాక్స్ కార్యాలయం ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. కొత్తపేట సంఘం అభివృద్ధి బాటలో కొనసాగుతుందని తెలిపారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతోపాటు రైతులకు ఎరువులు అమ్మడంతో సంఘం లాభాల్లో ఉందని తెలిపారు. 2025 - 26 అంచనా బడ్జెట్ రూ. 10,17,184ను ఆమోదించారు. కార్యక్రమంలో ప్యాక్ డైరెక్టర్లు మఠం చంద్రశేఖర్, మధుసూదన్ గౌడ్, అనిత శంకర్, యాదయ్య, పల్లాటి కృష్ణయ్య, బాలకృష్ణ యాదవ్, నాయకులు జగదీశ్వరప్ప, మల్లేష్‌యాదవ్, నవీన్‌కుమార్, ప్రేమ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఆదిభట్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేబినెట్ విస్తరణలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని, ఒకవేళ ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కల అశోక్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి లేరని, ఉమ్మడి జిల్లాను దృష్టిలో పెట్టుకొని అధిష్టానం సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. మంత్రి పదవి రాకుంటే ఇబ్రహీంపట్నం మున్సిపల్ శేరిగూడ గాంధీ విగ్రహం ఎదుట ఏప్రిల్ 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసిన మల్లేశ్ గౌడ్

కడ్తాల్, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను శనివారం కడ్తాల మండల గౌడ సంఘం అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాలే మల్లేశ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కేశంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామంలో శనివారం ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన అవ్వారు చంద్రశేఖర్ పొలం వద్ద ట్రాక్టర్‌ను ఉంచాడు. ఉదయం ట్రాక్టర్ స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చి డబ్బాలో ఉన్న బ్యాటరీని చూడగా కనిపించలేదు. రెండు రోజుల క్రితం లేమామిడి గ్రామానికి చెందిన డప్పు రామేష్, బర్కం రామచంద్రయ్య ట్రాక్టర్ల నుంచి బ్యాటీరీలు మాయమయ్యాయి. పోలీసులు బ్యాటరీ దొంగలపై నిఘా ఉంచాలని బాధితులు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

మాడ్గుల, 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్విన్ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అవి బ్రాహ్మణపల్లి వాసులకు చెందినవిగా గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని ట్రాక్టర్లను, జేసీపీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శంషాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తొండిపల్లి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మహ్మద్‌అజఘర్ (55) పాలమాకుల నుంచి మైలార్‌దేవ్‌పల్లిలో ఉండే తన కొడుకు వద్దకు శుక్రవారం బైక్‌పై బయలుదేరాడు. తొండిపల్లి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వార్డు అధికారి మృతి

ఆమనగల్లు, మార్చి29(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపల్ వార్డు అధికారి నీరటి పెంటయ్య (56)శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విధుల్లో ఉండగా చాతిలో నొప్పి రావడంతో తోటి సిబ్బంది ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాండూరుకు చెందిన పెంటయ్య రెండేళ్లుగా వార్డు అధికారిగా సేవలు అందిస్తున్నారు. సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, సిబ్బంది ఎల్లయ్య, మోహిన్, షర్ఫుద్దీన్, పర్వతాలు, రాములు, చందర్, సురేశ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్. నాయకులు ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి ఉన్నారు.

ఐక్యవేదిక సదస్సుకు తరలిరావాలి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా ఏర్పాటు కాబోతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈనెల 31న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఏసీ సదస్సు జరుగుతుందని ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. సదస్సుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజుముదిరాజ్, నర్సింహులు, చెన్నయ్య, నాగరాజు, శివ, నరేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

షాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని శ్రీబుగ్గరామేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వెంకటయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సత్యనారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేపీ దర్గాలో మాజీ ఎమ్మెల్యే ప్రార్థనలు

కొత్తూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను పురస్కరించుకొని మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ముజావర్లు ఆయనకు తలపాగా చుట్టి స్వాగతం పలికారు. అనంతరం దర్గాకు చాదర్, పూలు సమర్పించారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శని అమావాస్య సందర్భంగా శంషాబాద్ మండలంలోని మదనపల్లి శనీశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ నీరటి తన్విరాజు ముదిరాజ్ గురువు ఆశీర్వాదం తీసుకున్నారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, హమీదుల్లా నగర్ మాజీ సర్పంచ్ సతీశ్ యాదవ్, నర్కుడ మాజీ ఎంపీటీసీ సందనవెల్లి శ్రీనివాస్, అమ్మపల్లి ఆలయ డైరెక్టర్‌లు నీరటి అశోక్ ముదిరాజ్, గుండాల విశ్వనాథం, ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్ యాదవ్, శివకుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికల్లో కాసోజు విజయం

శంషాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ కోర్టు న్యాయవాదుల సంఘ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది కాసోజు యాదగిరి విజయం సాధించారు. యాదగిరి గెలుపునకు శంషాబాద్ మండలానికి సంబంధించిన రాజేంద్రనగర్ కోర్టు మాజీ అధ్యక్షుడు, న్యాయవాది కరుణాకర్‌గౌడ్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాసోజు యాదగిరిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

కేశంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయాని కేశంపేట తహసీల్దార్ అజాంఅలీ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం 'మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా' అంశాలపై గ్రామ సంఘం అధ్యక్షులు, గ్రామ సంఘం సహాయకులకు అవగాహన కల్పించారు. పిల్లల దత్తత, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రతగా ఉండాలన్నారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, మహిళా సంఘ్య అధ్యక్షురాలు, ఏపీఎం పాల్గొన్నారు.

పౌరహక్కులకు భంగం కలిగించొద్దు

చేవెళ్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కులకు ఎలాంటి భంగం కలిగించొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ అన్నారు. శనివారం పౌర హక్కుల దీనోత్సవం సందర్భంగా చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వివక్ష, అసమానతలను తొలగించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు ఊరెంట ప్రవీణ్‌కుమార్, నాయకులు మల్లేష్, మహేందర్ ఉన్నారు.